ఆయన నన్ను ఎంత ఆదరణగా చూసేవారో నేను చెప్పలేను నిజం చెప్పి, ఆయన ఆనందాన్ని నాశనం చెయ్యలేక ఈ రహస్యాన్ని నాలోనే దాచుకున్నాను.

కాలం అన్ని మార్పులని తెచ్చింది, రామం మా ఇద్దరి సంతానమేనని నేనుకూడా నమ్మేస్థితిలోకి వచ్చాను.

కాని నువ్వు ఈ కలని చెదరగొట్టావు... నీ మట్టుకు నువ్వు ఆస్తి యివ్వటం అన్యాయం అని ఎవ్వరూ అనరు. కాని ఒక్కొక్కసారి దైవం యిచ్చేవరం కూడా అర్హతలేనివారికి శాపంగా మారుతుంది.

రామానికి ఈ రహస్యం తెలియక పూర్వమే ఈ అవతారం చాలించే ధైర్యం నాకు ప్రసాదించు.

కన్నులు మూతబడుతున్నాయి. కలలు చేరువవుతున్నాయి... తియ్యని వెలుగేదో చల్లగా ఆత్మను తాకుతోంది... వెలుగు మాయమయింది. చీకటి చేరువయింది. శబ్దం నిశ్శబ్దంలో లీనమై పోయింది.

రాత్రి రెండు గంటలని గడియారం గంట కొట్టింది. సినిమానుంచి తిరిగివచ్చిన రామం. తల్లిని నిద్ర మేల్కొలపడానికి వ్యర్థ ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు.

# మంచుతెర

**మా**వూరి రాములవారి గుడి వెనకాల పూలతోటలో పట్టపగలే- దయ్యాలు తిరుగాడుతాయని వూళ్ళో జనాభాయావత్తూ ప్రతి ఒక్కడూ స్వయంగా వెళ్ళి చూచి వచ్చినంత ఖచ్చితంగా ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళు చెప్పడం మొదలు పెట్టారు. అందరిమాటా ఎల్లావున్నా ఆవుల మాలక్ష్మికి కనబడ్డవాడు మాత్రం దయ్యం అనడానికి వీలులేదు, వాడు రూపాయికి పదహారు అణాలు బ్రహ్మరాక్షసి అని అది వూరంతా చెప్పివేసింది. ఊళ్ళో వాళ్ళు కాదనలేదు. బ్రహ్మరాక్షసి అనగానే అది ఎవరో మావూళ్ళోవాళ్ళకు వెంటనే అర్థమయింది. మునసబునాయుడు కొడుకు ధర్మయ్య యమధర్మరాజు సవితి తమ్ముడంటే కాదని అనేవాళ్ళు ఎవరూలేరు. అంతేకాదు మునసబునాయుడుకూడా వాళ్ళ పక్షమే. బుచ్చయ్యకు మనువు ఏర్పాటయిన ఆవుల మాలక్ష్మి అంటే మునసబు నాయుడి కొడుక్కి వల్లమాలిన వ్యామోహం అది కంటబడితేనే కబళించి వేద్దామన్నంత ఆకలి అని అంతా అంటారు.

ఆ రోజున అన్నీ అలానే వొనగూడినాయి. మనం ఎన్నిసార్లు అడిగినా చెప్పదు కాని, మిట్టమధ్యాహ్నం ఊరికి దూరంగా వున్న చిట్టడివికి మాలక్ష్మి వెళ్ళవలసిన పనేమిటి ? అదేవేళకు ఎవరో చెప్పినట్టుగా మునసబునాయుడు కొడుకుకూడా అక్కడకు రావలసిన కారణం ఏమిటో అది యీనాటికీ ఎవరికి తెలియదు. చక్కగా తలదువ్వి పువ్వులు పెట్టుకుని యింట్లోంచి బయటకు వెళ్ళిన మాలక్ష్మి జుట్టంతా రేగిపోయి బట్టలు మట్టి కొట్టుకుని పోయి ఏడుస్తూ యింటికి తిరిగివచ్చేసరికి, చెప్పకుండానే దానికథ వూళ్ళో వాళ్ళందరికీ అర్థమయింది. ఏడి ? మునసబునాయుడి కొడుకు ? వాణ్ణి చంపుతాం నరుకుతాం అంటూ బాకులు బరిసెలు పుచ్చుకుని ఊళ్ళో అశేషజనం గుడివెనకాల చిట్టడివికి

పరుగెత్తుకుంటూ వెళ్ళారు.

చిట్టడివి అంతా ఆకు ఆకునా తీగ తీగెసందునా ముమ్మారు గాలించివేశారు. మునసబునాయుడికొడుకు ఏమైయ్యాడో ఎవరికి పత్తాలేదు.

ఇంత జరిగినా బుచ్చయ్య మాలక్ష్మితో మనువుకు ఒప్పుకునే వున్నాడు. ఒప్పుకోనిదల్లా ఆవుల మాలక్ష్మి ! !

ఆరోజునుంచి అందరికి దాన్ని చూస్తే భయమే. ధర్మయ్య ఏమయ్యాడని బుచ్చయ్య మునసబునాయుడిని తరిచి అడిగాడు. ఆయన చెప్పిన సమాధానం "నా కు ఏమీ తెలియదు".

ఈ రభస జరిగిన పక్షం లోపలే మునసబుగారి పాడియావులు అర్ధరాత్రివేళ ఎవరో తోలుకు పోవడం, గడ్డివాము అగ్గిపాలవడం చూశి ఇది బుచ్చిగాడి పనేనని ఊళ్ళో వాళ్ళంతా గట్టిగా నమ్మారు. వాడి దురంతం అరికట్టడానికి మంచి బందోబస్తు చెయ్యమని మునసబునాయుడితో గట్టిగానే చెప్పాడు. ఆయన సౌమ్యంగానే 'మీకేం పరవాలేదు.' అని అన్నాడు. 'ఇవ్వాళ మీ సొమ్ము అయింది రేపు మా సొమ్ము నష్టం కాదని ఏమిటి నమ్మకం?' అని రెట్టించి అడిగారు.

'వాడు మీ జోలికిరాడు' అని శాంతంగా అన్నాడు.'

బుచ్చిగాడు ఆ వూళ్ళోనే పిచ్చిగా తిరుగుతున్నాడు. వాడి పరిస్థితి ధోరణి చూస్తే వాడి కంటికి మా వూళ్ళో ప్రతివాడు మునసబునాయుడు కొడుకులాగానే కనిపిస్తున్నాడేమోనని మాకు భయం వేసేది. వాడు ఏ పొరపాటు చెయ్యలేదు. ఎవరికీ ఏ హాని చెయ్యలేదు కాని అన్నింటికంటె విడ్డూరం ఏమిటంటే యీ గొడవా యీ గందరగోళం జరిగిన రెండు నెలలకే మా లక్ష్మి మావూరు నుంచి మాయం కావడం !! దేశమంతా మళ్ళీ గాలించి వేశాం నూతులు గోతులు వెదికాం.

బుచ్చయ్యని ఒకటికి పదిసార్లు అడిగాం వాడు చెప్పిన సమాధానం ఒకటే.

'నాది వట్టి ముదనష్టపు జాతకం, చినబాబు'

ఇహ చెయ్యవలసినపనల్లా మాకు ఒకటే కనిపించింది. పోలీసు రిపోర్టు యివ్వడం, పేపర్లో వేయించడం. వీటి పరిణామాలు ఎల్లా వుంటాయో మాకు తెలుసు కనుక ఆ పని చెయ్యకుండా వూరుకున్నాం.

కనబడని మనిషి మీకు ఏమవుతుందని పోలీసులు అడుగుతారు దానికి సమాధానం ఏమిటి !

అందరికి బందువులాగా కనిఫించే ఆవుల మాలక్ష్మికి నా అనే వాళ్లు ఎవరైనా వుండాలంటె వివాహం అయిన తరువాత భర్త ఒకడే. పెళ్ళి యింకా కాలేదు కాబట్టి దానికి ఎవరు బంధువులులేరు.

మళ్ళీ దేశమంతా గాలించి వేశాం. మా లక్ష్మి కనిపించలేదు. ఏమైపోయిందోనని దిగులు పడ్డాం. పట్టణంలో కోర్టు సాక్ష్యానికి వెళ్ళిన రామకోటయ్య మా అందరికి చల్లటి వార్త చెప్పాడు. పట్టణంలో వాడికి మా లక్ష్మి కనిపించిందిట ఆ మాట వినగానే ఆబాల గోపాలం అంతా ఏనుగెక్కినంత సంబర పడ్డాం.

కాని ఆ సంబరం అట్టేసేపు నిలవలేదు. రామకోటయ్య చెప్పిన రెండో వాక్యం వినగానే మా అందరి నవ నాడులు కృంగిపోయాయి. మునసబునాయుడు కొడుకు ధర్మయ్య ఆవుల మా లక్ష్మి పట్టణంలో ఒక యింట్లో కాపురం పెట్టారట. ఇంతకంటే మా అందరికి అవమానం ఏం కావాలి? మళ్ళి ఒక్కుమ్మడి ఊళ్ళో జనమంతా బాకులు బరిసెలు పుచ్చుకుని బయలుదేరేవాళ్లే, కాని రామకోటయ్య మంచి లిటిగేషన్ లాంటి ప్రశ్న వేశాడు.

'వెళ్ళి ఏంచేస్తారయ్యా !' అని అడిగాడు.

'వాళ్ళకు గట్టిగా బుద్ధిచెబుతా' అని ఎవరో అన్నారు.

'ఏమని బుద్ధిచ్యెబుతావయ్యా?'

ఆ ప్రశ్నకు సమాధానం యేమిటని వాళ్ళల్లో వాళ్ళు కొంచెం గట్టిగానే ప్రశ్నించుకున్నారు. గుళ్ళొంచి అప్పుడే యింటికి వస్తున్న రామచంద్రయ్యగారి దగ్గరకు పెద్ద డెలిగేషనేలాగా వెళ్ళారు. గట్టిగా ఫిరియాదు చేశారు. ఆయన ఒక్క క్షణం ఆలోచించి,

'పట్టణానికి బండీ వుదా?' అని అడిగారు.

'ఈ పూట కిహ లేవు' అని రామకోటయ్య సమాధానం చెప్పాడు.

'సరే నేను రేపు పట్టణం వెళ్ళి కనుక్కువస్తాను. మీరిహ యిళ్లకు వెళ్ళండి' అని రామచంద్రయ్యగారు అని అన్నారు.

'మేము కూడా మీ వెంట వస్తాము.'

మీ అందరి తరపున నేను వెళ్ళి వస్తాను.

నిజమే ఆయన అందరికంటె పెద్దవాడు ఆయన వెళ్లడమే మంచిది అని వాళ్లల్లో వాళ్ల సమాధాన పడ్డారు. ఎవరి యిళ్లకు వాళ్ల వెళ్ళిపోయారు.

రాత్రి తొమ్మిదిగంటలకు రామచంద్రయ్యగారు మా యింటికి వచ్చారు.

'రేపు పట్నం వెళ్లితా' అని నాతో అన్నారు.

అక్కడకువెళ్ళి నన్నేం చెయ్యమంటారు !

ఇల్లు మార్చమని ధర్మయ్యతో చెప్పు.

వింటాడా?

రామకోటయ్య నోట్లో నువ్వు గింజదాగదు. ఊళ్లో జనం పట్టణానికి పోయినప్పుడు వాళ్ల యింటిమీద పడి యాగీ చేస్తారు.

మరి ఊళ్లో వాళ్ళ మాట?

పట్టణం వెళ్ళిరా నీకే తెలుస్తుంది.

పెద్దలు మీరు వెడితేనే సబబేమో.

నేను వెడితే మునసబు నాయుడికి కష్టం వేయవచ్చు.

మరి నేను వెడితెనో ?

నేను సద్దుకుని వస్తానుగా.

సరే.

తెల్లవారురఝాము రైల్లో బయలుదేరి పట్టణం వెళ్లాను. రామకోటయ్య చెప్పిన ఆనవాళ్ల ప్రకారం ఊళ్లో మోతుబరులుండె పేటకు వెళ్లాను. ఆ ఇల్లు కనుక్కున్నాను. అది మునసబు నాయుడు కొడుకు హోదాకు తగిన భవంతి. 'ధర్మయ్య' అంటూ రెండు

సార్లు తలుపు తట్టాను. తలుపు తెరుచుకుంది. నేను అల్లాగే నిలబడిపోయాను.

గుమ్మంలో బుచ్చయ్య నిలబడి వున్నాడు.

నా మనస్సుకు 'ఛీ !' అనిపించింది. గిరుక్కు వెనక్కి తిరిగాను.

'చినబాబు అంటూ బుచ్చయ్య పిలిచాడు.

ఎవరది? అంటూ ధర్మయ్య కంఠం వినిపించింది.

'ఇక్కడ నుంచి వడివడిగా పారిపోతే ??' అని అనిపించింది.

మళ్ళీ మరోక్షణంలో నేను వచ్చింది. పారిపోవటానికి కాదు. ధర్మయ్యకు గట్టిగా బుద్ధి చెప్పడానికి వచ్చాను.

ముందుకు సాగిన పాదం ఆగింది. వెనక్కి తిరిగి యింట్లోకి వెళ్లాను. ఇన్ని మాసాల తరువాత మళ్ళీ ధర్మయ్య ముఖం వంక చూసాను. ఎవరెన్ని మాటలు అన్నా ఒక్క మాటమాత్రం నిజం. ధర్మయ్య మా అందరికంటె అందమైనవాడు. వాడిబుద్ధులు అంత అందంగాను వుంటె మాకీ తిప్పలే వుండేవి కాదు.

'ఏం చిన్నబాబు చాలా కాలానికి కనబడ్డావు' అంటూ ధర్మయ్య ఎంతో ఆప్యాయంగా పలకరించాడు.

'కూచో చినబాబు' అంటూ బుచ్చయ్య ఆహ్వానించాడు. మరుక్షణంలో లోపలనుంచి గాజుల చప్పుడు వినిపించింది.

'మన చినబాబుగారే. రా' అని బుచ్చయ్య అన్నాడు.

మాలక్ష్మి ముందుకు రాబోయింది కాని, సిగ్గు వేసిందో ఏమో అంతలోనే తలుపు చాటునే నిలబడింది.

నేనే మాలక్ష్మి సిగ్గెందుకు అని అన్నాను. సిగ్గుపడుతూనే వచ్చి నిలబడింది.

'కులాసాగా ఉన్నావా' అని అడిగాను.

'రామచంద్రయ్య బాబుగారు బాగున్నారా?' అని తను అడిగింది.

బాగున్నారు. మిమ్మల్నందర్ని చూసి రమ్మన్నారు.

'ఆయన చెప్పకపోతే రావా చినబాబు' అని ధర్మయ్య అడిగాడు.

'ఎక్కడున్నారో తెలిస్తే ఎందుకు రాను?'

'చిన్నబాబు అందరిలాంటివాడు కాదు' అని మాలక్ష్మి అన్నది.

'నేను వెడతానని లేచాను'

అదేమిటి చినబాబు భోజనం చెయ్యకుండా వెళ్లడానికి వీలులేదు.

నేను తటపటాయించాను.

'మా భోజనం పెట్టంలే హోటలునుంచి క్యారియరు తెప్పించుతాను.'

'కాదులే ధర్మయ్యా నాకు వూళ్లో పని వుంది.'

పనుంటె మాత్రం భోజనం చెయ్యవాయేమిటి? ఆ భోజనం మాయింట్లోనే చెయ్యి.

అయితే యీ లోపల పని చూసుకుని వస్తాను.

బుచ్చయ్యకూడా నీతో వస్తాడు.

పారిపోను లేవయ్యా.

పారిపోదలచుకుంటె యిల్లా వచ్చేవాడివే కాదుగా ? బుచ్చయ్యకు బజారులో

పని వుందిలే.

బుచ్చయ్య నేను బజారు వెంబడి నడవటం మొదలు పెట్టాం. సంభాషణ ఎల్లా మొదలు పెట్టాలో అర్థం కాక నేను మౌనంగానే నడక సాగించాను.

'ధర్మయ్య చాలా మంచివాడు' అని బుచ్చయ్య అన్నాడు. నేనేం మాట్లాడలేదు. కాని పిడుగు పడ్డంత నిశ్శబ్దంగా మనస్సుని ఆవరించింది. ఎందుకనో అర్థం కాలేదు కాని బుచ్చయ్యమీద వల్లమాలిన కోపం వచ్చింది.

'నోరు మూసుకోరా' అని అన్నాను.

బుచ్చయ్య నావంక చూచి బిగ్గరగా నవ్వాడు.

'సిగ్గులేకపోతే సరి' అని అన్నాను.

బుచ్చయ్య నవ్వుతూనే మా లక్ష్మి మీద ఎంత దయ నీకు చినబాబు' అని అన్నాడు.

'ఛీ!' అని అన్నాను.

'మరి అయితే యింత దూరం ఎందుకు వచ్చావు?'

రామచంద్రయ్యగారు వెళ్ళి రమ్మన్నారు.

ఆయనొకడు తనే ప్రెసిడెంటు అనుకుంటాడు.

బుచ్చయ్యా మతిపోయిందా.

మన వూళ్లో మతెవడికుంది ?

మిగతా వాళ్ల విషయం ఎల్లావున్నా ఒక్క విషయం మాత్రం ఖాయం. బుచ్చయ్యను పిచ్చి ఆసుపత్రిలో తప్పక చేర్చాలి. వీలుంటె యీ పూటే ఆ యేర్పాటు చేయించాలి.

నిజమే అని నేను అన్నాను.

అయినా మా వూసు మాలక్ష్మి వూసు మీ అందరికి ఎందుకు ?

యేమిటిరా నువ్వనేది ?

ప్రతివాడికి యిదోపనైంది. ఆ సచ్చినోడు రామకోటయ్య చేసినపని యిది.

యేం చేశాడురా ?

వూళ్లో వాళ్లందరిని మా యింటి మీదకు తోలుతున్నాడు. మొన్న యీ వూరు వచ్చాడా? మనవూరువాడుకదా అని మాలక్ష్మి యింటికి రమ్మని పిలుస్తే వచ్చి, పీకదాకా ఫలహారం మెక్కి, మ్మల్నందర్ని అడ్డమైన కూతలు కూసిపోయాడు. అది నా దగ్గర వల వలా ఏడ్చింది. ఈసారి యీ ఛాయలకు రమ్మను నిలువునా చీరేస్తాను.

బుచ్చయ్య త్రాగగా నేనెన్నడూ చూడలేదు. వాడి ధోరణి చూస్తే పట్టణం వచ్చిన తరువాత అలవాటు చేసుకున్నాడేమోనని అనుమానం వేసింది. బుచ్చయ్య ! మాలక్ష్మి !! ధర్మయ్య యీ మూడు పేర్లు గందరగోళంగా నామనస్సులో పరుగెత్తాయి.

మనస్సులో మసలిన మాట ఒకటే. బుచ్చయ్యను మనం ఎంత తప్పుగా అర్థం చేసుకున్నాం.

మట్టిబెడ్డను మాణిక్యమనుకుని మోసపోయాము. బుచ్చయ్య అన్నమాట నిజమే. మాలక్ష్మి వూసు నాకెందుకు? అది ఎల్లా పోతే నాకేం ? బుద్ధిలేనివాడిని కాబట్టే పని చెరుపుకుని యిల్లా వచ్చాను.

మళ్లి ధర్మయ్య యింటికి దేనికి సరాసరి మా వూరే వెళ్లిపోతా ... అసలు విషయం తెలుసుకోకుండా వెడితే వూళ్లో వాళ్లు కాకులని పొడిచినట్టు పొడవరా ? రామచంద్రయ్యగానే చిన్నబుచ్చుకోరా ?

బజారులో అటూ యిటా తిరిగి అర్ధగంట వ్యర్ధంచేసి, రెండు మూడు అనవసరమైన సామాన్లు వస్తువులు కొనుక్కుని ధర్మయ్య యింటికి తిరిగి వెళ్లాను.

హోటలునుంచి వచ్చిన క్యారియరు నా కోసం సిద్ధంగా వున్నది. రెండు మెతుకులు కొరికి భోజనం అయిందనిపించి మావూరుకు ప్రయాణమయ్యాను.

'చినబాబు ఒక్క మాట' అని ధర్మయ్య అన్నాడు.

'ఏమిటి ధర్మయ్య'

'ఈసారి రాములవారి కళ్యాణం మన గుడిలో బుచ్చయ్య, మా లక్ష్మి చేద్దామనుకుంటున్నారు.'

మరి.

వాళ్లు యీ వూళ్లోనే పెళ్లిచేసుకున్నారు.

నిజం !

నిజం చినబాబు

మరి నువ్వు ?

నిక్షేపంలాగా వున్నాను.

ఏం జరిగిందో చెప్పు ధర్మయ్య

తెలిసినవాళ్లని అడుగు

ఏం విషయం !

మాలక్ష్మి విషయం నా విషయం.

నాకు యీసారి గట్టిగానే కోపం వచ్చింది.

'దానికి సిగ్గులేదు. నీకు ఎగ్గులేదు. ఇంతకంటె క్రొత్త విషయం యేముంది !

చినబాబు !

ధర్మయ్యా నువ్వు రౌడీ వైతే నీకంటె పెద్ద రౌడిని నేను.'

'చినబాబు' అంటూ మాలక్ష్మి గొంతుక వినిపించింది. నేను గిరుక్కున వెనక్కి తిరిగాను 'పిలవకుండా వచ్చిన నీకు పిలిచినంత మర్యాద చేశాం. ఎందుకాయన మీదకు పోట్లాటకు వస్తావు !'

మంచులాగా నా కోపం హరించుకుపోయింది.

'మీరు మీరు యేం అఘోరించినా నాకేం అక్కర్లేదు. మిమ్మల్ని యీ యిల్లు మార్చమని రామచంద్రయ్యగారు చెప్పమన్నారు. వూళ్లో వాళ్లంతా మీ యింటి మీదకు వచ్చి యాగీ చేస్తారు'

'మా యిష్టం వచ్చిన చోట మేముంటాం' అని మా లక్ష్మి అన్నది.

ఇల్లు మారుస్తానులే చినబాబు' అని ధర్మయ్య అన్నాడు.

నేను వడివడిగా అంగలు వేసుకుంటూ స్టేషనకు బయలుదేరాను.

మావూరు తిరిగిరాగానే రామచంద్రయ్యగారి యింటికి వెళ్లేను ఆయన, మునసబునాయుడు కలిసి మాట్లాడుకుంటున్నారు. పూస గుచ్చినట్టు అంతా వివరంగా చెప్పాను. రామచంద్రయ్యగారు యేం మాట్లాడలేదు. మునస'బునాయుడి ముఖంలో మందహాసం కనిపించింది. యేదో కొండంత బరువు తీరినట్టు తేలిక పడ్డాడు.

'దానికేం వుంది అలాగే చేయిద్దాం వాళ్ళు కళ్యాణం చేస్తే దివ్యంగా వుంటుంది' అని మునసబు నాయుడు అనగానే రామచంద్రయ్యగారు నవ్వి,

'వాళ్ళ యిద్దరికి రాజీ ఎప్పుడు కుదిరిందో ? అని అడిగాడు.

'చినబాబు మావాడు ఎల్లా వున్నాడు' అని యింతసేపటికి మునసబు అడిగాడు.

'దివ్యంగా వున్నాడు.'

ఇంటికి వస్తాను అన్నాడా.

'ఆ ప్రసక్తే రాలేదు'

పట్టణం నుంచి అందెయ్యనాయుడు కూతురిని యిస్తామని వచ్చారు.

నేనేం మాట్లాడలేదు.

'బుచ్చయ్య విషయంలో' అంటూ రామచంద్రయ్యగారు ఏదో చెప్పబోయారు.

'వాడికి మతిపోయినమాట ఖాయం' అని నేను కోపంగా అన్నాను.

'నీకు అర్ధం కాదులే రామం ... బుచ్చయ్య యోగిలాంటి మనిషి.'

ఇహ వాళ్లతో మాట్లాడటం కాని అక్కడ నిలవటం కాని అనవసరమనిపించింది, సరాసరి గుడికి వెళ్లాను. ఈ చిక్కు సమస్యకు పరిష్కారం తెలియాలి. ఊళ్లో అందరి అవగాహనమైన విషయం నాకు మాత్రం ఎందుకు అర్ధం కావటం లేదు?

ధర్మయ్య మంచివాడు.

బుచ్చయ్య మహా యోగి.

మాలక్ష్మి మహా యిల్లాలు.

నేను ఎవరిని?

అజ్ఞానిని, అవివేకిని.

ఈ సింహావలోకనం యీ ఆత్మ పరీక్ష ఎంతసేపు జరిగేదో నాకు తెలియదు. నా ఆలోచనలకు అంతరాయం కల్పిస్తూ ఒక మెల్లని, తియ్యగా. నన్ను,

'యేమండి?' అంటూ పిలిచింది.

ఆ కంఠం వినిపిస్తే నా మనస్సులో చింతలు, చికాకులు దూరంగా తొలగిపోయి వెన్నెల జడివాన వెల్లివిరుస్తుంది. మనసున మల్లెలు మందహాసం చేస్తాయి.

రామచంద్రయ్యగారి ఏకైక పుత్రిక జానకి నాకు అతి సాన్నిహిత్యంలో సాక్షాత్కరించింది. ఇంకోకసారి, యింకోకవేళ అయితే ఆ చిన్నారి పిలుపువింటే నన్ను నేనే మైమరచి యీ లోకాన్నే మరిచిపోయేవాడిని ఆనందం అవధులు దాటేది. కారణం మా యిద్దరి మాటా ఒకటే మనస్సు ఒకటే !!

కాని యీ రోజు మనస్సు మనస్సులో లేదు.

'మా లక్ష్మి ఎల్లా వుది? అని జానకి అడిగింది.

నేనేం మాట్లాడలేదు.

ఆకసాయి పంచను ఎల్లా బ్రతుకుతుందో?

'చాలా సుఖంగా'

'నేను నమ్మను !'

'చూచి వచ్చిన వాడిని నేను'

కళ్ళకు కనబడేదంతా నమ్మలేం

నిజమే ...

ఎవరిమీద కోపం అని జానకి అడిగింది.

నీమీదనే ఎందుకనో?

నాకున్న అజ్ఞానంమీద ...

ఈ విషయం మొగవాళ్ళకు అర్థం కాలేదు. ఆడదాన్ని కాబట్టి యిట్టే అర్థమయింది.

ఏమిటది ?

'వ్రతం చెడ్డా ఫలం దక్కాలని మా లక్ష్మి యీ పని చేసింది.'

మా లక్ష్మి బుచ్చయ్యని పెళ్లి చేసుకుంది.

బుచ్చయ్యనా ? ఎల్లా ఒప్పుకున్నాడు.

ఒప్పుకోవడమే కాడు ధర్మయ్య మంచితన్నాన్ని వెయ్యినోళ్ళ పొగుడుతున్నాడు.

ఆశ్చర్య పడటం యీసారి జానకి వంతు.

పోనీలే పీడ విరగడయింది.

ఎక్కడా ? వాళ్ళు వచ్చి మన గుళ్ళో రామకళ్యాణం చేస్తారుట.

ఎప్పుడు?

శ్రీరామనవమికి.

నాన్నగారు ఒప్పుకున్నారా ?

సంబరపడుతున్నారు.

జానకి ఏం మాట్లాడలేదు. స్తంభం దగ్గరగా వెళ్ళి నిలబడింది. నావంక చూడలేదు. నేను దగ్గరకు వెళ్ళి 'జానకి !' అని పిలిచాను.

జీనకి ఏం మాట్లాడలేదు. ముఖం రెండు చేతుల్లో కప్పుకుంది జానకిని దగ్గరగా తీసుకుంటూ,

'కన్నీళ్ళు దేనికి పిచ్చిపిల్లా' అని అన్నాను.

కళ్యాణం మనం చేస్తామని ఎంతో అనుకున్నాను.

నిజమే రామకళ్యాణం యీ సంవత్సరం మేము యిద్దరం కలిసి చెయ్యాలని మా వివాహనికి పూర్వమే నిర్ణయించుకున్నాం. వివాహం జరిగిన తరువాత పసుపు బట్టలతో ఆలయానికి విచ్చేసి స్వామివారి సన్నిధిలో నిలబడ్డప్పుడు కూడా మాయిద్దరి మనస్సులో మసలిన మాటకూడా యిదే.

'స్వామీ నీదయవల్ల మా ప్రేమ ఫలించి మా వివాహము జరిగింది. లోకకళ్యాణం కోసం నీ వివాహం మేము జరిపించుతాం. మాకు ఆ వరం ప్రసాదించు' అని మ్రొక్కుకున్నాం. ఆనాడు మా మనస్సు ఎంత ఆనందంతో నిండిపోయింది !! ఎన్ని

పెన్నిధులు మాకు లభ్యమైనట్టు సంబరపడ్డాం.

కాని ఆస్వామివారికే. ఒక మతిమాలినవాడు ఒక చెడిపోయిన ఆడది కలసి భార్య భర్తలం అని చెప్పుకుంటూ తన భార్యకు వివాహం కాకపూర్వం, చెరచడానికి ప్రయత్నం చేసిన రౌడి పంచనే చేరివాడి ఎంగిలి మెతుకులతో తృప్తిపడే, ఒక పరమ నీచాతి నీచుడు మా స్వామివారికి కళ్యాణం చెయ్యడమా ? ఇది నా కంఠంలో ప్రాణం ఉండగా జరగదు. ఈ అకార్యాన్ని సర్వవిధాలా ప్రతిఘటిస్తాను.

సరాసరి ఊళ్లోకి వెళ్లాను. నలుగురిలో జరిగిన సంగతి అంతా చెప్పాను. అన్ని విషయాలలోను ఏకీభవించని మా ఊళ్లో జనం యీ విషయంలో మాత్రం తల వూపారు.

బుచ్చయ్య విషయం మాకు అనవసరం. మాలక్ష్మి చెడిపోయిన మనిషి. అది మన గుళ్లో రామకళ్యాణం చెయ్యడానికి ఏ మాత్రం వీల్లేదు.

ఈ నిర్ణయం తెలియజేయవలసిన బాధ్యత నాకే వప్పచెప్పారు. ఇంటికి తిరిగి వచ్చాను. మనస్సు ఎందుకో చిన్నబోయింది. రామచంద్రయ్యగారిని పలుకరిద్దామని వెళ్లాను.

ఆయన నాతో ముభావంగా వున్నారు, ఆయన్ని పలుకరించడానికి సాహసం చాలలేదు.

ఆయనకు నామీద కోపం వచ్చింది. ఎందుకని? ఏమో!

చెదిరిన మనస్సుతో మునసబు నాయుడు యింటికి వెళ్లాను. ఆయన కూడా దిగులుగా కూర్చొని వున్నాడు.

ఆయన కూడా నా వంక ఏం మాట్లాడకుండా క్షణం పరకాయించి చూసాడు.

'చినబాబు రేపు పట్టణం వెడుతున్నావా' అని అడిగాడు.

నేనేం సమాధానం చెప్పలేదు.

ఆయన కుర్చీలోంచి లేచి అటూ యిటూ పచార్లు చెయ్యడం మొదలు పెట్టాడు. ఆయన అదో చెబుదామని ఒకటి రెండుసార్లు ప్రయత్నం చేశాడు. క్షణం సందేహించాడు. రవ్వంత తటపటాయించాడు.

'చినబాబు ఒక మాట చెప్పనా!' అని అన్నాడు.

చెప్పండి.

నాకు కొండంత భారం తీరినట్టు అనిపించింది. వూరికి పెద్ద అధికారి. అందరికన్నా ఎక్కువైన మనిషి. ఆయన మాటను ఎవరూ కాదనలేరు.

నేనే పట్టణం వెళ్ళివస్తాను అని ఆయన అన్నాడు.

'అంతకన్న ఏం కావాలి ?' అని నేను అన్నాను.

మునసబు నాయుడు మరునాడు తెల్లవారు ఝామున బయలుదేరి పట్టణం వెళ్లాడు. వెళ్లిన మనిషి వారం రోజులైనా తిరిగి రాలేదు. వూళ్లో జనమంతా నామీద విరుచుకునిపడ్డారు. నేనే వెళ్లివుంటే యీ అనర్థం జరిగి వుండేది కాదని నన్ను దుయ్యబట్టుకున్నారు.

పంచాయితి ప్రెసిడెంటుని కాబట్టి మునసబుని వెతికి పట్టుకుని యీవూరు తీసుకువచ్చే బాధ్యత నాదే అని అన్నారు. మరునాడు సాయంకాలంలోపున

మునసబునాయుడు యింటికి తిరిగి రావాలని గడువుపెట్టారు.

సాయంకాలందాకా ఆయనకోసం ఎదురు చూడవలసిన అవుసరం లేకపోయింది. మధ్యాహ్నం టపాలో ఉత్తరం వచ్చింది. రాగానే జానకికి చూపించాను.

చదివి కళ్ళనీళ్ళు పెట్టుకుంది 'ఎంత మంచివాడు' అని అన్నది.

ఆ ఉత్తరం చదివి రామచంద్రయ్యగారు

'ఎంత మోసపోయాం' అని అన్నాడు.

నన్ను దుయ్యబట్టుకున్న నలుగురు పెద్దలకు ఆ ఉత్తరం చూపించాను. వాళ్లు ముక్కుమీద వేలువేసుకున్నారు.

మొత్తం జనాభా పట్టణం తరలివవెళ్ళి బుచ్చయ్యను మాలక్ష్మిని రామకళ్యాణం చెయ్యడానికి ఆహ్వానించాం.

శ్రీరామనవమి వచ్చింది. రామకళ్యాణం కోసం బుచ్చయ్య ఆవుల మాలక్ష్మి తరలి వచ్చారు. వాళ్ళకు లభించిన స్వాగతం ఏ మహానాయకుడికి కూడా లభించలేదు. ధర్మయ్య రాలేదు. రాలేదేమని ఎవ్వరూ అడగలేదు. నేను జానకి రామకళ్యాణం చూడటానికి వెళ్ళాం మంత్రపుష్పం సమయంలో డబ్బుల కోసమని చెయ్యి పెట్టాను. ఏదో కాగితం కనిపించింది. తీసి చదవటం మొదలుపెట్టాను. అది మునసబునాయుడి ఉత్తరం.

చినబాబు

ఈ ఉత్తరం నీకు చేరేసరికి నేను మీ అందరికి చాలా దూరంలో వుంటాను. మన గ్రామం తిరిగి రాకూడదనే నిర్ణయానికి వచ్చాను. ధర్మయ్యం బుచ్చయ్య మాలక్ష్మి నిష్కారణంగా నాశనమైపోతారనే భయంతో యీ నిర్ణయానికి వచ్చాను. చేసిన తప్పు ఒప్పుకుని తలెత్తుకుని తిరగగల శక్తి నాకు లేదు. ఆనాడు గుడిదగ్గర తోటలో, బొగడ పువ్వులు ఏరుకోవడానికి వచ్చిన మాలక్ష్మిని పాపపు చూపు చూశినవాడిని నేనే తన తండ్రిలాంటివాడిని యిటువంటి నీచానికి ఒడికట్టానని అది గగ్గోలు పడిపోయి పిచ్చిదానిలాగా పారిపోయింది... నా మాటనమ్ము చినబాబు ! మాలక్ష్మికి ఏ మచ్చాలేదు. నా కడుపున పుట్టినవాడే నా గౌరవం కాపాడటం కోసమని నింద తనమీద మోపుకుని పరారి అయ్యాడు.గొడ్లు పంపించి వేసింది, గడ్డి వాములు తగలపెట్టింది నేనే... ధర్మయ్య ఏం చేశాడో, ఎల్లా నచ్చచెప్పాడో కాని బుచ్చయ్య మనస్సు కుదట పరిచాడు. మా లక్ష్మి బ్రతుకు బండలు కాకుండా కాపాడాడు హిరణ్యా కశిపుడి కొడుకుని ఎప్పుడూ ప్రహ్లాదుడే వూడతాడు. మా యింట్లోనూ అంతే. నన్ను శపించి, దూషించి మీ మనస్సులు పాడుచేసుకోకండి ... నన్ను మరిచిపొండి.

మాలక్ష్మిని బుచ్చయ్య మామూలు మనుష్యులలాగా బ్రతకనివ్వండి ఇదే ఆఖరి కోరిక. ప్రార్దన. శెలవు.

రంగయ్య.